సాక్షి
అన్నమయ్య జిల్లా
శుక్రవారం । 1 । డిసెంబర్ । 2023



పెరిగిన వేతనం..
వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత విద్యారంగంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. తాజాగా పీజీటీలకు వేతనాలు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారు. -IIలో



బాల్యవివాహాన్ని అడ్డుకున్న అధికారులు
ఇంటర్ చదువుతున్న బాలికకు వివాహం చేసే ప్రయత్నాలను ఐసీడీఎస్ అధికారులు, పోలీసులు అడ్డుకున్నారు. -IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.210	రూ.280
రెండోరకం	రూ.110	రూ.200

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 409 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	200	200
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 8.660 కిలోలు

న్యూస్‌రీల్

9న జెడ్పీ సర్వసభ్య సమావేశం
కడప సెవెన్‌రోడ్స్: కడపజిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం డిసెంబరు 9వ తేదీన నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత డిసెంబరు 12వ తేది జరపాలని నిర్ణయించినా పార్లమెంటు శీతాకాల సమావేశాలు 2వ తేదీ నుంచి ప్రారంభమవుతున్న కారణంగా 9వ తేదికి మార్పు చేసినట్లు తెలిపారు.

నేడు ఎయిడ్స్ ర్యాలీ
రాయచోటిటౌన్: రాయచోటి పట్టణంలో ప్రపంచ అంతర్జాతీయ ఎయిడ్స్ డే సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు జిల్లా అదనపు వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి శైలజ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాయచోటి పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి బంగ్లా వరకు అక్కడ నుంచి పట్టణంలోని అన్ని ప్రధాన వీధుల గుండా ఈ ర్యాలీ నిర్వహించి ప్రజలకు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ ర్యాలీలలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

కనకదాసకు నివాళి
రాయచోటి: శ్రీకనకదాస కీర్తనలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా ఎన్నికల అబ్జర్వర్ మురళీధర్‌రెడ్డి, కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. గురువారం శ్రీ కనకదాస జయంతి మహోత్సవం సందర్భంగా రాయచోటి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కనకదాస చిత్రపటానికి జిల్లా ఎన్నికల అబ్జర్వర్, జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ తదితరులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ, కలెక్టరేట్ ఏఓ బాలకృష్ణ, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ సందప్ప, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

4న ఉర్దూ కవి సమ్మేళనం
మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం బెంగుళూరు బస్టాండు వద్దనున్న బడేమకాన్ దర్గా ఉరుసు ఉత్సవాల్లో భాగంగా ఈనెల 4న అఖిల భారత ఉర్దూ కవి సమ్మేళనం (నాతియా ముషాయిరా) నిర్వహించనున్నట్లు దర్గా ముతవల్లి మకాన్‌దార్ సయ్యద్ హాషిం, నిర్వాహకులు ఖమర్ అమీని, పఠాన్ మహమ్మద్‌ఖాన్ తెలిపారు. ఇందులో పలువురు ఉర్దూ కవులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మదనపల్లె ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహ్మద్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహ్మద్, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ కలీమ్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఉర్దూ సాహితీప్రియులు, భాషాభిమానులు కార్యక్రమానికి పాల్గొని కవి సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని కోరారు.

4న సర్టిఫికెట్ల పరిశీలన
రాయచోటి అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీలో అప్రెంటిస్ చేసేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 4న సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం ఉంటుందని ఏపీఎస్‌ఆర్టీసీ జోనల్ సిబ్బంది శిక్షణ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.నజీర్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 4న తమ ఎస్ఎస్‌సీ, ఐటీఐ, ఎన్‌సీవీటీ సర్టిఫికెట్లు, ఎస్సీ,ఎస్టీ,బీసీ అభ్యర్థులు కులధ్రువీకరణ పత్రాలు, వికలాంగులు, మాజీ సైనిక ఉద్యోగులైతే ధ్రువీకరణ పత్రం, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ సర్టిఫికెట్లు, పాన్‌కార్డు, డ్రైవింగ్‌లైసెన్స్, బ్యాంకు అకౌంట్ పాసు బుక్కు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్ కార్డులను సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు తీసుకురావాలన్నారు. సర్టిఫికేషన్ వెరిఫికేషన్ ఫీజు కింద ఒక్కొక్కరు రూ. 118లు చెల్లించవలసి ఉంటుందన్నారు. డీజిల్ మెకానిక్, మోటార్‌మెకానిక్, ఎలక్ట్రిషియన్, వెల్డర్, పెయింటర్, డ్రాఫ్ట్స్‌మెన్ విభాగాలకు చెంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మాత్రమే జనవరి 4వతేది మధ్యాహ్నం 2 నుంచి 5గంటల వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరుకావాలన్నారు. వివరాలకు 08518 257025 నంబరుకు కార్యాలయం పనివేళల్లో సంప్రదించాలని కోరారు.

8 నుంచి అంగన్‌వాడీల మెరుపుసమ్మె



మాట్లాడుతున్న రాజేశ్వరి

రాయచోటి అర్బన్: అంగన్‌వాడీలు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం కోసం డిసెంబరు 8 నుంచి మెరుపు సమ్మె నిర్వహించనున్నట్లు సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎస్టీయూ నేతలు శ్రీలక్ష్మి, రాజేశ్వరి, సరోజ, మస్రూన్‌బీ అన్నారు. గురువారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆయా సంఘాల అంగన్‌వాడీ వర్కర్‌ల సమావేశంలో వారు మాట్లాడారు. మాతా,శిశు మరణాల రేటును తగ్గించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఐసీడీఎస్‌కు బడ్జెట్ కేటాయించడంలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయంటూ ఆరోపించారు. ఈ మెరుపుసమ్మెకు అంగన్‌వాడీ వర్కర్లంతా మద్దతునిచ్చి విజయవంతం చేయాలంటూ పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు బంగారుపాప, భాగ్యలక్ష్మి, ఓబులమ్మ, ఖాజాబీ, గౌరి, సిద్దమ్మ, సుకుమారి, అమ్మాజీ, భూకై లేశ్వరి, కుమారి, స్వర్ణ,పద్మావతి, సుజాత పాల్గొన్నారు.

ఆత్మీయంగా పలకరిస్తూ...

- కడప ఎయిర్‌పోర్టు, దర్గా వద్ద ముఖ్యమంత్రికి ఘన స్వాగతం
- దర్గా గురువుల మజార్లకు పూలచాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు



పెద్ద దర్గాలో చాదర్ సమర్పిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



మహిళ సమస్యను ఆలకిస్తున్న సీఎం



సాక్షి కడప : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం మధ్యాహ్నం కడపకు చేరుకుని పెద్దదర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నంద్యాల జిల్లా అవుకు టన్నెల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం నేరుగా హెలికాప్టర్ ద్వారా ముఖ్యమంత్రి 2.25 గంటలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు.అక్కడి నుంచి రోడ్డు మార్గాన 2.55 గంటలకు పెద్దదర్గాకు చేరుకున్న ముఖ్యమంత్రికి పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్‌తోపాటు ఇతర నాయకులు ఘన స్వాగతంపలికారు. అక్కడున్న నేతలు, కార్యకర్తలను ఒక్కొక్కరిని ఆప్యాయంగా పలుకరిస్తూ సీఎం ముందుకు కదిలారు.

పెద్దదర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దదర్గాలోకి రాగానే దర్గా సంప్రదాయబద్ధంగా తలపాగా ధరింపజేశారు. అనంతరం గురువుల మజార్లను దర్శించుకుని పూలచాదర్ సమర్పించారు. ప్రత్యేక ప్రార్థనలతోపాటు ఫాతెహా నిర్వహించారు. దర్గాలో కొద్దిసేపు గడిపిన సీఎం సమీపంలోనే ఉన్న దర్గా ప్రతినిధులు, భక్తులు అందరితో చాలా సేపు ముచ్చటించారు. అనంతరం దర్గాలోని గ్రంథాలయంలో పీఠాధిపతితో కాసేపు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా పెద్దదర్గాకు సంబంధించిన పలు అంశాలను పీఠాధిపతి వివరించారు.

రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రజలకు అభివాదం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోన్‌రెడ్డిని చూసేందుకు రోడ్డుకు ఇరువైపులా జనం కిక్కిరిసిపోయారు. ఎయిర్ పోర్టు నుంచి పెద్దదర్గాకు వచ్చేటపుడు కాన్వాయ్‌లో వాహనం నుంచే అందరికీ అభివాదం చేస్తూ వచ్చిన సీఎం...తర్వాత పెద్ద దర్గాలో ప్రార్థనలనంతరం, వెళ్లే సమయంలోనూ జనాలు కిక్కిరిసిపోయారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అంటూ కేకలు వేయడంతో దర్గా బయట కొద్దిసేపు వాహనం నిలిపి మహిళలతో మాట్లాడారు. అటు, ఇటుగా ఉన్న ప్రజలకు నమస్కరిస్తూ ముందుకు కదిలారు.

పటిష్ట బందోబస్తు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఒకరోజు పర్యటనను పురస్కరించుకుని జిల్లా పోలీసు శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్ ఎయిర్‌పోర్టు నుంచి పెద్దదర్గా వరకు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి ప్రత్యేకంగా పర్యవేక్షించారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా ముగియడానికి పోలీసులు ప్రత్యేక కృషి చేశారు.



ప్రార్థనలో పాల్గొన్న సీఎం, డిప్యూటీ సీఎం, ఎంపీ



అభిమాన నాయకుడిని చూసి ప్రజల కేరింతలు



ఉరుసుకు సంబంధించిన బ్రోచర్ సీఎంకు అందజేత

వైభవంగా పీఠాధిపతి నగరోత్సవం



ప్రత్యేక వాహనంలో ఆశీనులైన దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్

కడప కల్చరల్: ప్రముఖ సూఫీ పుణ్యక్షేత్రమైన అమీన్‌పీర్ (పెద్ద) దర్గా ఉరుసు మహోత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా గురువారం రాత్రి దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ నగరోత్సవాన్ని కడపలో వైభవంగా నిర్వహించారు. ఉదయం ఫకీర్లు, ఇతర శిష్య గణాలతో కలిసి పీఠాధిపతి పెద్ద దర్గా నుంచి పెన్నానది అటువైపు తీరాన గల గండి వాటర్ వర్క్స్ కొండలోని గుహల వద్దకు వెళ్లి జెండా ప్రతిష్ఠించి ఫాతెహా నిర్వహించారు. తర్వాత ఆ ప్రాంతంలో హజరత్ మస్తాన్‌స్వామి స్మారకంగా అన్నదానం నిర్వహించారు. సాయంత్రం అక్కడి నుంచి ఊరేగింపుగా కడప నగరానికి తిరిగి వచ్చారు. పలు వాహనాలలో ఆయన శిష్యులు, ప్రముఖులు ఆయన వెంట ఊరేగింపులో పాల్గొన్నారు. రాత్రి మాసాపేటలోని హజరత్ మై అల్లా దర్గా షరీఫ్ వద్ద నుంచి పీఠాధిపతి ఫకీర్లు, సంఘ ప్రతినిధులతో విద్యుద్దీపాలు, పూలతో అలంకరించిన ప్రత్యేక వాహనంపై నగరంలో ఊరేగింపుగా బయలుదేరారు. దాదాపు అన్ని కూడళ్లలో భక్తులు పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి ఆనందాన్ని వ్యక్తం చేశారు. బ్యాండు మేళాలకు అనుగుణంగా నృత్యాలు ప్రదర్శించారు. ఊరేగింపు తెల్లవారుజామున తిరిగి దర్గాకు చేరి ఊరేగింపుగా తెచ్చిన చాదర్‌ను గురువు మజార్‌కు సమర్పించారు.

ముసాయిదా ఓటర్ల జాబితా భేష్

ఓటర్ల జాబితాపై పరిశీలకులు మురళీధర్‌రెడ్డి సంతృప్తి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకులు మురళీధర్‌రెడ్డి

రాయచోటి: అన్నమయ్య జిల్లాలో ముసాయిదా ఓటర్ల జాబితా సంతృప్తికరమని అన్నమయ్య జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకులు మురళీధర్‌రెడ్డి (ఐఏఎస్) పేర్కొన్నారు. గురువారం ఉదయం రాయచోటిలోని కలెక్టరేట్‌లో ముసాయిదా ఓటర్ల జాబితా-2024 సంబంధించి కలెక్టర్ గిరీషా పీఎస్‌తో కలిసి ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అన్నమయ్య జిల్లాలో చేపడుతున్న ముసాయిదా ఓటర్ల జాబితా-2024 గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పరిశీలకుడికి వివరించారు. జిల్లాలోని వివిధ నియోజకవర్గాలు, మండలాలు 2024కు జనాభా అంచనా, తదితర అంశాలను వివరించారు. జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు 1607 పోలింగ్ స్టేషన్స్ ఉన్నాయని తెలిపారు. జిల్లాలోని వివిధ నియోజకవర్గాలకు కేటాయించిన ఈఆర్‌ఓలు విధివిధానాలను వివరించారు. జిల్లాలో 1297 మంది విధి నిర్వహణలో ఉన్న ఓటర్ల జాబితా గురించి వివరించారు. అలాగే జిల్లాలో కొత్తగా చేరిన ఓటర్లు 6128 అని, తొలగించిన ఓటర్లు 58008 అని తెలిపారు. జిల్లాలో పోలింగ్ బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాను పరిశీలించినట్లుగా కలెక్టర్ ఆయనకు వివరించారు. జిల్లాలో నమోదైన అభ్యంతరాలను 26 డిసెంబర్ నాటికి క్లియర్ చేస్తామని, తుది జాబితాను జనవరి 5, 2024 నాటికి ప్రచురితమయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లుగా వివరించారు. జిల్లాలో ఇటీవల ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలలో వచ్చిన అభ్యంతరాలను గురించి వెల్లడించారు. తంబళ్లపల్లి నియోజకవర్గంలో ఒక పోలింగ్ బూత్ లెవల్ అధికారిని సస్పెండ్ చేశామన్నారు. అలాగే 18 నుంచి 19 ఏళ్ల ఓటర్లను చైతన్యం చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లుగా చెప్పారు. గ్రామీణ ప్రాంతాలలో 1378 పోలింగ్ స్టేషన్లు, పట్టణ ప్రాంతాలలో 229 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని వెల్లడించారు. అన్నమయ్య జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకులు మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో ముసాయిదా ఓటర్ల జాబితా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వారం వారం రాజకీయ పార్టీలతో సమావేశం అవుతున్నారని, దీనిని ఇలాగే కొనసాగించాలని సూచించారు. సార్వత్రిక ఎన్నికలకు ఓటింగ్ జరగకముందే ఓటర్ల జాబితా సరిగా ఉందా లేదా అనేది చూసుకోవడం, పోలింగ్‌స్టేషన్లు ఎలక్షన్ కమిషన్ విధి విధానాలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అన్న రెండు ముఖ్యమైన అంశాలు ఉంటాయని ఆయన వివరించారు. రాజకీయ పార్టీల నాయకులను ఉద్దేశించి మాట్లాడుతూ.. అధికారులు నిష్పక్షపాతంగా పనిచేస్తారని పక్షపాతం చూపిస్తే ఎలక్షన్ కమిషన్ ఊరుకోదని హెచ్చరించారు. అన్నమయ్య జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకుడిగా మొదటిసారి వచ్చానని, ఇంకా పలుమార్లు జిల్లాకు వస్తానని, రాజకీయ పార్టీలకు ముందే సమాచారం ఇస్తానని ఈ సందర్భంగా తెలియజేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ, రాయచోటి, మదనపల్లి, రాజంపేట ఆర్డీఓలు రంగస్వామి, మురళి, రామకృష్ణారెడ్డి, ఎస్‌డీసీ శ్రీలేఖ, వివిధ మండలాల తహసీల్దార్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం ప్రభుత్వ లక్ష్యం



వంద పడకల ఆసుపత్రి భవనాలను పరిశీలిస్తున్న ఎండీ మురళీధర్ రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా రాయచోటిలో వందపడకల ఆసుపత్రిని అభివృద్ధి చేస్తామని ఏపీఎంఎస్ ఐడీసీ ఎండీ మురళీధర్ రెడ్డి, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. గురువారం రాయచోటిలోని వందపడకల ఆసుపత్రి భవనాల నిర్మాణ పనులను వారు పరిశీలించారు. ఆసుపత్రి నిర్మాణంలోని ప్రతి గదిని పరిశీలించి పలు సూచనలు, సలహాలు అందజేశారు. డిసెంబర్ కల్లా ఆసుపత్రి భవనాన్ని ప్రారంభించి ప్రజలకు వైద్య సేవలు అందించాలని ప్రయత్నం చేశామని.. కానీ నిర్మాణంలోనే చిన్నపాటి ఆలస్యం కారణంగా జనవరి నెలలో ఆసుపత్రి భవనాలను ప్రారంభించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఆసుపత్రి ప్రాంగణం ప్రారంభంలో ఏర్పాటు చేసిన ఆర్చీ నిర్మాణాలను, ఆక్సిజన్ ప్లాంట్‌ను వారు పరిశీలించారు. ఐసీయు వార్డుకు లిఫ్ట్ ఏర్పాటు విషయాన్ని ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ టి డేవిడ్ కుమార్‌కు ఎండీ సూచనలు చేశారు. డయాలసిస్ కేంద్రంలో ఎనిమిది బెడ్లు ఉన్నాయని, మూడు షిఫ్ట్‌ల ద్వారా రోజుకు 24 మందికి డయాలసిస్ చేయడం జరుగుతోందని, ఇంకా నిరీక్షణ జాబితాలో 150 మంది ఉన్నారని తెలిపారు. అయితే ఈ కేంద్ర భవనం సక్రమంగా లేదని, ఈ భవనం పక్కనే టీబీ భవనం నిరుపయోగంగా ఉందని, ఆ రెండింటిని కలిపి ఆధునీకరిస్తే మరింత మంది డయాలసిస్ రోగులకు సౌకర్యంగా ఉంటుందని, ఆధునీకరణ పూర్తి అయ్యేంతవరకు ఆసుపత్రి వార్డులలోనే ఎంఎస్ఐడీసీ ఎండీ, జిల్లా కలెక్టర్‌లను ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి కోరారు.రహదారి పక్కనున్న విద్యుత్ లైన్ మార్చాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు మెరుగైన వసతుల కల్పనే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. రాయచోటి వందపడకల ఆసుపత్రి భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి త్వరలో జాతికి అంకితం చేస్తామన్నారు. అంతకుముందు ఆసుపత్రి ఆవరణంలోని రోగులతో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి మాట్లాడారు. వైద్యం అందుతున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ బేపారి మహమ్మద్ ఖాన్, ఏపీఎంఎస్ఐడీసీ ఎస్ కృష్ణారెడ్డి, ఈఈకెజేఎస్ చంద్రారెడ్డి, డీఈ రాజగోపాల్ రెడ్డి, వైద్యాధికారులు కిరణ్ కుమార్, లక్ష్మీ ప్రసాద్, నాయకులు చాన్ బాషా, ఫయాజ్ అహమ్మద్, సాదిక్ అలీ, సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, సుగవాసి శ్యామ్, జానం రవీంద్ర యాదవ్, కో-ఆప్షన్ అయ్యావారు రెడ్డి, హజరత్ ఖాదర్ వల్లి, షబ్బీర్, రౌనక్ పాల్గొన్నారు.

అవగాహనతోనే రక్షణ

- హెచ్‌ఐవీ బాధితులకు ఏఆర్‌టీ కేంద్రాల ద్వారా చికిత్స
- పింఛన్ అందజేస్తూ ఆదుకుంటున్న ప్రభుత్వం
- నేడు ప్రపంచ ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవం



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

మదనపల్లె సిటీ: 'ఎయిడ్స్ ... ఈ పేరు వింటేనే జడిసిపోతాం. దీన్నొక మహమ్మారిగా భావిస్తుంటాం. ప్రస్తుతం ఈ వ్యాధి నియంత్రణకు వైద్య,ఆరోగ్యశాఖ జిల్లాలో 'ఎయిడ్స్ నివారణ,నియంత్రణ సంస్థ' ఆధ్వర్యంలో బాధితులకు అవగాహన కల్పిస్తూ, అవసరమైన మందులందజేస్తూ వారి జీవితకాలాన్ని పొడిగించుకోవడానికి కృషి చేస్తోంది. పలు స్వచ్ఛంద సంస్థలు సైతం ఈ దిశగా తమదైన శైలిలో కృషి చేస్తున్నాయి. అయినా అవగాహన లోపం కారణంగా ఈ వ్యాధి చాపకింద నీరులా విస్తరిస్తూనే ఉంది. సురక్షితం కాని అక్రమ సంబంధాలు, స్వలింగ సంపర్కులు, కలుషిత ఇంజెక్షన్ల ద్వారా వ్యాధి విస్తరిస్తోంది. జిల్లాలో ఎక్కువగా మదనపల్లె,రాయచోటి,పీలేరు అధికంగా బాధితులు ఉన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపు మేరకు ఈ వ్యాధి నివారణలో భాగంగా 1988 డిసెంబర్ 1న ప్రపంచ ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవం నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పించానికి కృషి చేస్తున్నారు. ' సమాజ భాగస్వామ్యమే ఎయిడ్స్‌కు పరిష్కారం' . ఈ ఏడాది నినాదం. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తిస్తూ వైద్యశాఖ, స్వచ్ఛంద సంస్థలు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అనుమానితులకు ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్ధారణ పరీక్షలు చేయిస్తున్నారు. ఈ వ్యాధి విస్తరించటానికి వాహకులుగా ట్రాక్కర్స్, వలసదారులు, వితంతువులు, యువత, అనాథలు కారణమవుతున్నట్లు గుర్తించారు. ప్రభుత్వం హెచ్ఐవీ పాజిటివ్ రోగులకు ప్రతి నెలా రూ.2,750 చొప్పున పింఛన్ అందజేస్తోంది.

ఐసీటీసీ కేంద్రాలో పరీక్షలు, కౌన్సెలింగ్

ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్ సెంటర్లలో హెచ్ఐవి పరీక్షలు నిర్వహిస్తున్నారు. సెంటర్‌లో బాధితులకు కౌన్సెలింగ్ ఇస్తూ వారిలో మనోధైర్యం కల్పిస్తున్నారు. వారి జీవితకాలం పెంపుకోసం ఏఆర్‌టీ కేంద్రానికి పంపి ఉచితంగా మందులు అందజేస్తున్నారు. ఎంతో మందికి కౌన్సెలింగ్ ద్వారా వారి జీవితాల్లో మార్పులు తెస్తున్నారు.

జిల్లాలో ఐసీటీసీ కేంద్రాల వివరాలు: మదనపల్లె, వాల్మీకిపురం, పీలేరు, తంబళ్లపల్లె, బి.కొత్తకోట, రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు,లక్కిరెడ్డిపల్లె

ఎస్ఐటీ కేంద్రాలు: మదనపల్లె, రాయచోటి

ఏఆర్‌టీ కేంద్రం: మదనపల్లె

లింక్ ఏఆర్‌టీ కేంద్రాలు: రాయచోటి,పీలేరు, తంబళ్లపల్లె, బి.కొత్తకోట, రాజంపేట, రైల్వేకోడూరు, లక్కిరెడ్డిపల్లె

ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు
హెచ్ఐవీ పరీక్షలు: 18813 మంది
పాజిటివ్ కేసులు: 165
జిల్లాలో మొత్తం పాజిటివ్ కేసులు: 4275

వారిపై వివక్ష చూపొద్దు



ఎయిడ్స్‌పై బిడియం వదిలి అంతా బహిరంగంగా చర్చించాల్సిన అవసరం ఉంది. అనుమానం ఉన్న వారు పరీక్ష చేయించుకోవాలి. వ్యాధి సోకిన వారికి మందులు కౌన్సెలింగ్ ద్వారా జీవిత కాలం పెంచేలా చూస్తున్నాం. వ్యాధి సోకిన తర్వాత విచారించడం కంటే దీని బారినపడకుండా దూరంగా ఉంటే ఇబ్బంది ఉండదు. వ్యాధి సోకిన వారి పట్ల వివక్ష చూపొద్దు.
–డాక్టర్ శైలజ,
ఎయిడ్స్ నియంత్రణ అధికారిణి, అన్నమయ్య జిల్లా

రక్తహీనత నివారణకు చర్యలు చేపట్టాలి: జేసీ



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న జేసీ ఫర్మాన్ అహ్మద్

రాయచోటి: గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలలో రక్తహీనత నివారణకు చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం వివిధ శాఖల కార్యదర్శులతో కలిసి జిల్లా కలెక్టర్లు, జేసీలతో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి వివిధ అంశాలపై వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్సుకు అన్నమయ్య జిల్లా రాయచోటి కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య, డీపీఓ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జేసీ అధికారులతో మాట్లాడుతూ రక్తహీనత లోపం ఉన్న గర్భిణీల ఆరోగ్య పరిస్థితులపై ప్రత్యేక దృష్టి పెట్టి వారికి సరైన పోషకాహారం అందించి రక్తహీనత నివారణకు కృషి చేయాలన్నారు.

పెరిగిన వేతనం.. వెల్లివిరిసిన ఆనందం

- పార్ట్‌టైం పీజీటీలకు శుభవార్త
- రూ. 12 వేల నుంచి ఒకేసారి రూ. 26,759 పెరిగిన జీతం
- జిల్లాలో 18 మంది పీజీటీలకు లబ్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న పీజీటీలు వారి కుటుంబీకులు
- జూన్ నెలలో ప్రిన్సిపాల్స్, సీఆర్‌టీలు, పీఈటీలకు పెరిగిన వేతనాలు


సింహాద్రిపురం కేజీబీవీ

కడప ఎడ్యుకేషన్ : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత విద్యారంగంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఇప్పటికే నాడు- నేడు కింద ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మార్చారు. దీంతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం, బూట్లు, బెల్ట్‌లతోపాటు రోజుకో మెనూతో పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. చిక్కీలు, రాగి జావ వంటి వాటిని అందిస్తున్నారు. అనాథ, పేద పిల్లలు చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో అప్పటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల(కేజీబీవీ)ను ఏర్పాటు చేశారు. వాటిలో వేల మంది అనాథ, పేద పిల్లలు చదువుకుని విద్యావంతులుగా తయారై ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత పదవ తరగతి తరువాత కొంతమంది బాలికలు బడికి దూరమవుతున్నట్లు గ్రహించి మరో అడుగు ముందుకేసి కేజీబీవీల్లో ఇంటర్ విద్యను ప్రవేశ పెట్టారు.

జిల్లాలో 18 మంది పీజీటీలకు లబ్ధి..

జిల్లావ్యాప్తంగా 17 కేజీబీవీలు ఉన్నాయి. వీటిలో 2018–19 సంవత్సరంలో ఇంటర్ విద్యను అప్‌గ్రేడ్ చేశారు. వీటిలో ఇంటర్ తరగతులను బోధించేందుకు అప్పట్లో పార్ట్‌టైం కింద 18 మంది పీజీటీలను ఎంపిక చేశారు. వీరికి ఒక్కొక్కరికి రూ. 12 వేల వేతనం నిర్ణయించారు. వీరంతా తమకు జీతాలు పెంచాలని పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించారు. ఎట్టకేలకు స్పందించిన ప్రభుత్వం రూ. 12 వేలు ఉన్న జీతాన్ని ఒకేసారి రూ. 26,759కి పెంచింది. ఈ మేరకు సమగ్రశిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. వీరికి పెరిగిన జీతం డిసెంబర్ 1వ తేదీ నుంచి వర్తింపనుంది. దీంతో వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న పీజీటీ, ప్రిన్సిపాల్ పోస్టులను కూడా...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది జులై నెలలో కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న ప్రిన్సిపాల్, పీజీటీ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. ఇందులో 29 కేజీబీవీలలో 128 మందికి గాను 123 మందికి ఉద్యోగాలను కల్పించారు. ఇందులో 8 మందికి ప్రిన్సిపాల్స్‌గా, 89 మందికి పీజీటీలుగా, 20 మందికి సీఆర్‌టీలుగా మరో 6 మందికి పీఈటీ పోస్టులను ఇచ్చారు.

జూన్‌లో పెరిగిన వేతనాలు...

కేజీబీవీలలో పనిచేసే పీజీటీలకు తప్ప మిగతా ప్రిన్సిపాల్స్, పీఆర్‌టీలకు, పీటీలకు ఈ ఏడాది జూన్ నెలలో వేతనాలు పెంచారు. ఇందులో ప్రిన్సిపాల్స్‌కి రూ. 27,755 ఉండే వేతనాన్ని రూ. 34,139 పెంచారు. అలాగే సీఆర్‌టీలకు రూ. 21,755 నుంచి 26,759, పీఈటీలకు రూ. 21,755 నుంచి 26,759లకు పెంచారు. అలాగే పీజీటీలకు కూడా తాజాగా రూ. 12 వేల నుంచి ఒకేసారి రూ. 26,759 పెంచేశారు.

కేజీబీవీల్లో పనిచేసే సిబ్బంది జీతాలు గతంలో.. ఇప్పుడు

కేడర్	పనిచేస్తున్న సిబ్బంది సంఖ్య	గతంలో ఇస్తున్న వేతనం	ప్రస్తుతం ఇస్తున్న వేతనం
ప్రిన్సిపాల్స్	14	రూ. 27,755	రూ. 34,139
పీజీటీలు	18	రూ. 12000	రూ. 26,759
పీఆర్‌టీలు	115	రూ. 21,755	రూ. 26,759
పీఈటీలు	14	రూ.21,755	రూ. 26,759

చాలా సంతోషంగా ఉంది



నేను చాపాడు మండలం కేజీబీవీలో మ్యాథ్స్ సబ్జెక్టును బోధిస్తున్నాను. చాలా కాలం నుంచి నేను రూ. 12 వేల వేతనంతో పనిచేశాను. మా జీతాలు పెంచాలని పలుమార్లు మా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాము. స్పందించిన ప్రభుత్వం రూ. 26,759కి పెంచింది. చాలా సంతోషంగా ఉంది.మేము ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాము.
– వసుంధర, మ్యాథ్స్ పీజీటీ, కేజీబీవీ, చాపాడు

వేతనం పెరిగింది..



మాకు గతంలో రూ. 21,755 వేతనాన్ని ఇచ్చే వారు. అలాంటిది ఈ ఏడాది జూన్ నెలలో మాకు కూడా వేతనాన్ని పెంచారు. ప్రస్తుతం నా వేతనం రూ. 26,759 వస్తుంది. చాలా సంతోషంగా ఉంది.
– రమాదేవి, సీఆర్‌టీ, కేజీబీవీ, దువ్వూరు.

డిసెంబర్ నెల నుంచే..



కేజీబీవీల్లో పనిచేసే పీజీటీలకు పెంచిన వేతనం డిసెంబర్ నెల నుంచి వర్తిస్తుంది. వీరికి జనవరి నెలలో పెరిగిన జీతం చేతికి వస్తుంది. కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న పోస్టులన్నీ దాదాపు భర్తీ చేశాము. దీంతో కేజీబీవీల్లో చదువుతున్న పిల్లలకు నాణ్యమైన విద్య అందుతుంది.
– అంబవరం ప్రభాకర్‌రెడ్డి, జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి.

క్లుప్తంగా

సీపీఎం జిల్లా కార్యదర్శిపై ఫిర్యాదు

బి.కొత్తకోట : సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు, మరికొందరిపై మండలంలోని గోళ్లపల్లె గ్రామానికి చెందిన పి.వెంకటరమణ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన సర్వేనంబర్ 427/బి 2 బి లోని 2.27 ఎకరాల భూమి వంశపార్యంపర ఆస్తి అని, ఈ భూమిలోకి బుధవారం శ్రీనివాసులు తోపాటు మరికొందరు దౌర్జన్యంగా ప్రవేశించి జేసీబీతో భూమి స్థితిని దెబ్బతీసేలా పనులు చేయించారని పేర్కొన్నారు. భూమిని ఆక్రమించుకునే ప్రయత్నం చేశారని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

డ్రంక్‌అండ్ డ్రైవ్ కేసులో ఏడుగురికి జైలు


డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో శిక్ష పడిన నిందితులు

రాయచోటిటౌన్ : మద్యం తాగి వాహనాలు నడిపినందుకు ఏడుగురికి జైలు శిక్ష ఖరారు చేస్తూ ఏజేఎఫ్‌సీఎం ఎస్‌ఎంటీకే శారద తీర్పు చెప్పారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఎస్‌ఐ మహమ్మద్ రఫీ తన సిబ్బందితో కలసి పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద వాహనాలు తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. వారిలో ఏడుగురు మద్యం తాగి వాహనాలు నడిపినట్లు నిర్ధారణ కాగా వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచామన్నారు. వీరిని విచారించిన న్యాయమూర్తి ఒక్కొక్కరికి మూడు రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారని తెలిపారు.

విద్యుత్ కార్మికుల నిర్బంధం


గేటుకు తాళం వేయడంతో లోపలే ఉండిపోయిన విద్యుత్ కార్మికులు

నందలూరు(రాజంపేట) : నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ, అరవపల్లి ఆర్‌ఎస్ రోడ్డులోని పాత స్టేట్‌బ్యాంక్ ఆవరణలో విద్యుత్ కార్మికులను ఇంటి యజమాని నిర్బంధించిన సంఘటన గురువారం ఉదయం చోటుచేసుకుంది. పాత స్టేట్ బ్యాంక్ సమీపంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. దీంతో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేందుకు విద్యుత్ అధికారులు ఆ భవన ఆవరణలోకి ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న వాహనంతో వెళ్లారు. పనులు చేస్తుండగా ఆ భవన యజమాని ఎవరిని అడిగి లోనికి వచ్చారంటూ విద్యుత్ అధికారులను, వాహనాన్ని లోపలపెట్టి గేటుకు తాళం వేశాడు. ఈ విషయాన్ని విద్యుత్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇంటి యజమానిని పిలిపించి మందలించడంతో గొడవ సద్దుమణిగింది.

బాల్యవివాహాన్ని అడ్డుకున్న ఐసీడీఎస్ అధికారులు

తల్లిదండ్రులు, బంధువులకు కౌన్సెలింగ్


బాల్యవివాహాన్ని అడ్డుకుని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఐసీడీఎస్, పోలీసు అధికారులు

మదనపల్లె : ఇంటర్ చదువుతున్న బాలికకు వివాహం చేసేందుకు ప్రయత్నిస్తున్న తల్లిదండ్రులు, బంధువులను నిలువరించి, బాల్యవివాహం జరగకుండా ఐసీడీఎస్ అధికారులు, పోలీసులు అడ్డుకున్న ఘటన గురువారం జరిగింది. పట్టణంలోని నీరుగట్టువారిపల్లె రామాలయం వీధిలో బాల్యవివాహం జరుగుతోందని స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐసీడీఎస్ సీడీపీఓ సుజాత, టూటౌన్ ఏఎస్‌ఐ రమణ, సిబ్బందితో కలిసి బాలిక ఇంటికి వెళ్లారు. స్థానికంగా నివాసం ఉంటున్న బ్రహ్మాచారి, లలిత దంపతులకు ఒక కుమారుడు. కుమార్తె ఉన్నారు. వీరిలో కుమారుడు నాలుగోతరగతి చదువుతుండగా, కుమార్తె తేజస్విని(16) పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. బాలిక తల్లిదండ్రులు తిరుపతిలో నివసిస్తూ, వరుసకు బంధువులైన వెంకటరమణాచారి, శారదమ్మ కుమారుడు సునీల్(24)తో శుక్రవారం ఉదయం వివాహం చేయాలని నిర్ణయించి, ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. మైనర్ బాలికకు వివాహం చేస్తున్నారన్న విషయం సచివాలయ మహిళా సంరక్షణాధికారి(ఎంఎస్‌కే) ద్వారా ఐసీడీఎస్ అధికారులకు తెలవడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకుని అబ్బాయి, అమ్మాయి తరపు తల్లిదండ్రులు, బంధువులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. హిందూ వివాహ చట్టం ప్రకారం వధువుకు 18, వరుడికి 21 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహం చేయాలని, మైనర్లకు వివాహం చేస్తే చట్టరీత్యా నేరమని, కారకులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అమ్మాయికి 18 సంవత్సరాలు నిండేంతవరకు వివాహం జరపబోమని అమ్మాయి, అబ్బాయి తల్లిదండ్రుల వద్ద లిఖితపూర్వకంగా స్టేట్‌మెంట్ రాయించుకుని వివాహాన్ని నిలుపుదల చేయించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్రగాయాలు


గాయపడిన సీతారామయ్య

మదనపల్లె : వేర్వేరు రోడ్డుప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తంబళ్లపల్లె మండలం కోటకొండ గ్రామానికి చెందిన సీతారామయ్య(65) గ్రామ సమీపంలో రోడ్డుపక్కన నడిచి వెళుతుండగా, గుర్తుతెలియని వ్యక్తి ద్విచక్రవాహనంలో వచ్చి ఢీకొన్నాడు. ప్రమాదంలో సీతారామయ్య తీవ్రంగా గాయపడగా, స్థానికులు వెంటనే 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. అదేవిధంగా మదనపల్లె పట్టణం ఇందిరానగర్ దొంతివీధికి చెందిన హసన్‌సాబ్ కుమారుడు కె.నజీర్(45) పుంగనూరు రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద నడిచివెళుతుండగా, టోయింగ్ వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిర్మాణానికి అడ్డుపడుతున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు


గ్యారంపల్లెలో నిర్మాణంలో ఉన్న గ్రామ సచివాలయ భవనం

కేవీపల్లె : గ్రామ సచివాలయ భవన నిర్మాణానికి అడ్డుపడుతున్న టీడీపీ నాయకుడిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు గ్యారంపల్లె సర్పంచ్ కె. రెడ్డెప్ప, కాంట్రాక్టరు జయప్రకాష్‌రెడ్డి తెలిపారు. గురువారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గ్యారంపల్లెలో సర్వే నెంబరు 215/6లో ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు స్థలం కేటాయించారని చెప్పారు. దీంతో గ్రామానికి మంజూరైన గ్రామ సచివాలయ భవన నిర్మాణం చేపట్టామని తెలిపారు. భవన నిర్మాణం పూర్తి కావచ్చిందని, భవనం ముందు మెట్లు నిర్మాణం చేపట్టే క్రమంలో గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు జ్ఞానప్రకాష్ ఆ స్థలం తమదంటూ నిర్మాణం జరగకుండా అడ్డుపడుతున్నాడని తెలిపారు. వాస్తవానికి ప్రభుత్వ స్థలంలోనే జ్ఞానప్రకాష్ అక్రమంగా పశువుల కొట్టం ఏర్పాటు చేశారన్నారు. గ్రామ సచివాలయానికి దారి కూడా లేకుండా అడ్డుపడుతుండడంపై గతంలో కూడా మండల తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయగా అధికారులు నోటీసులు జారీ చేశారని తెలిపారు. అధికారులు స్పందించి సమగ్ర విచారణ జరిపించి ప్రజలకోసం నిర్మిస్తున్న గ్రామ సచివాలయ భవన నిర్మాణం పూర్తి చేయడానికి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యల్లారెడ్డి, రమణ, కె. కిషోర్‌కుమార్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. చౌడేపల్లె మండలం కొండయ్యగారిపల్లెకు చెందిన భద్రప్ప కుమారుడు వై.మునిరత్నం(41) నిమ్మనపల్లె మండలం అగ్రహారం పంచాయతీ తరిగొండవారిపల్లెకు అత్తారింటికి వచ్చాడు. గురువారం ఉదయం గ్రామ సమీపంలోని చెరువు వద్ద పురుగుమందు తాగాడు. అనారోగ్యకారణాలతో ఆత్మహత్యకు యత్నించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అదేవిధంగా కురబలకోట మండలం అంగళ్లు హైస్కూల్‌వీధికి చెందిన రెడ్డిబాషా కుమారుడు ఆర్.ఇబ్రహీం(32) గురువారం ఇంటివద్దే పురుగుమందు తాగాడు. బాధితుడు స్థానికంగా ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో రూ.3.5లక్షలు అప్పుగా తీసుకున్నాడు. 13 వాయిదాల పాటు సక్రమంగా చెల్లించాడు. గత రెండు వాయిదాలు చెల్లించకపోవడంతో ఫైనాన్స్ సంస్థ నుంచి కుటుంబ సభ్యులకు వేధింపులు అధికం కావడంతో మనస్తాపంతో ఆత్మహత్యకు యత్నించాడు. ఆయా ఘటనల్లో కుటుంబ సభ్యులు బాధితులను 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.



విద్యార్థుల్లో నైపుణ్యాల అభివృద్ధి



విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికి తీసే చక్కటి విద్యావిధానం అమలవుతోంది. గతంలో కేవలం పుస్తకాల్లోని పాఠ్యాంశాలను మాత్రమే బోధించే అవకాశం ఉండేది. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ బైజూస్ ట్యాబ్‌లు వంటి సౌకర్యాలతో పిల్లలు ప్రపంచంలో జరుగుతున్న ఆధునిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటున్నారు. జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద వల్ల విద్యార్థుల్లో పౌష్టికాహార లోపం లేకుండా చూస్తోంది. గతం కన్నా ఇప్పుడు విద్యార్థుల్లో నైపుణ్యాలు అభివృద్ధి చెందుతున్నాయి. ట్యాబులు వారి వద్ద ఉండటం వలన వ్యక్తిగత మూల్యాంకనం చేసుకునేందుకు చక్కటి మార్గం లభించింది.
– రసూల్ బావాజీ, ఆక్టివ్ బైజూస్ ఉపాధ్యాయుడు, జెడ్పీహెచ్‌ఎస్, మదనపల్లె.

సొంతింటి కల నెరవేరింది



పక్కాగృహం మంజూరు కోసం గత టీడీపీ పాలనలో ఎన్నోసార్లు అర్జీలు ఇచ్చినా ప్రయోజనం లేకపోయింది. వైఎస్సార్‌సీపీ పాలనలో జగనన్న పుణ్యమా అని పక్కాగృహం కోసం వలంటీర్ ద్వారా దరఖాస్తు చేసుకున్నాం. ఇల్లు మంజూరై గోడల వరకు పూర్తి చేసి పైకప్పు నిర్మాణానికి సిద్ధం చేస్తున్నాం. ఇన్నేళ్లకు మాకు సొంతింటి కల నెరవేరినందుకు చాలా సంతోషంగా ఉంది. మాలాంటి పేదలకు ప్రభుత్వమే సాయం చేసి చేదోడు వాదోడుగా నిలుస్తోంది. అధికారులు కూడా ఇంటి మంజూరు పట్టా ఇచ్చి అన్ని విధాలుగా సహకరిస్తున్నారు.
– పూల నారాయణస్వామి, కొండయ్య గారిపల్లి. పెద్దతిప్పసముద్రం మండలం.

రేషన్‌కార్డుతో పాటు ఆరోగ్యశ్రీ కార్డు పొందాను



గత ప్రభుత్వంలో రేషన్ కార్డు మంజూరు కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ వందల సార్లు తిరిగాను. కానీ ఫలితం లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇంటి వద్దకే వచ్చి మా సమస్యను తెలుసుకుని రేషన్ కార్డుతో పాటు ఆరోగ్యశ్రీ కార్డు మంజూరు చేశారు.
– మెహరూన్, ములకలచెరువు,ఇందిరా కాలనీ

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

గాలివీడు : మండల పరిధిలోని గుండ్ల చెరువు గ్రామం దుర్గమ్మ చెరువులో మండల కేంద్రం చాపల కాలనీకి చెందిన బి.నారాయణ కుమారుడు బి. మనోహర్ (22) విద్యుత్ ప్రమాదంలో మృతి చెందాడు. స్తంభానికి స్టే వైర్ ఉండడంతో చెరువు నీటికి స్టే వైర్ ద్వారా విద్యుత్ సరఫరా కావడంతో చేపల వేటకు వెళ్లిన మనోహర్ మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

కర్నాటక మద్యం స్వాధీనం

మదనపల్లె : అక్రమంగా కర్నాటక మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషా తెలిపారు. బుధవారం రాత్రి నక్కలదిన్నె ఆర్చి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, కోళ్లబైలు పంచాయతీ వెంకటేశ్వరపురానికి చెందిన జి.భరత్‌కుమార్(28) ద్విచక్రవాహనంలో 28 టెట్రాప్యాకెట్ల కర్నాటక మద్యం తరలిస్తున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు. మద్యం విలువ దాదాపు రూ.2,786 ఉంటుందన్నారు. నిందితుడిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

ప్రతి కార్డుదారుకు నిత్యావసర సరుకులు అందాలి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పౌర సరఫరాల అధికారి రఘురాం

కలకడ : అన్నమయ్య జిల్లాలోని ప్రతి కార్డుదారునికి ప్రభుత్వం అందించే ఉచిత బియ్యం, నిత్యావసర సరుకులు అందించే బాధ్యత అధికారులు మొదలుకుని చౌకదుకాణ డీలర్ల వరకు అందరిపై ఉందని జిల్లా పౌరసరఫరాల అధికారి రఘురాం అన్నారు. గురువారం కలకడలో వీఆర్‌ఓలు, ప్రభుత్వ చౌక ధరల దుకాణ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్ల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఎంతో విలువచేసే సన్నరకం బియ్యాన్ని ఉచితంగా బియ్యం కార్డుదారులకు అందజేస్తోందన్నారు. వాటిని పక్కదారి పట్టిస్తే క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు. బియ్యం బదులు రాగులు ప్రతికార్డుకు ఒక కిలో చొప్పున విధిగా అందజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, గోడౌన్ డీటీ రమేష్‌కుమార్‌రెడ్డి, సివిల్‌సప్లై డిప్యూటీ తహసీల్దార్ కృపావతి, డీలర్ల సంఘం అధ్యక్షుడు సురేంద్ర, వీఆర్‌ఓలు, డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు పాల్గొన్నారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

– రూ.2,05,000 స్వాధీనం

సంబేపల్లె : ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసి రెండు లక్షల ఐదువేల రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు రాయచోటి రూరల్ సీఐ తులసీరామ్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని నాగిరెడ్డిగారిపల్లి పంచాయతీలో పేకాట ఆడుతున్నారని ముందస్తు సమాచారం అందడంతో తన సిబ్బందితో పేకాట స్థావరంపై దాడి నిర్వహించారు. నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

చెలరేగిన బ్యాట్స్‌మన్


వై. తేజారెడ్డి (150 పరుగులు)


రవికిరణ్ (121 పరుగులు)


ధరణికుమార్‌నాయుడు (102 పరుగులు)


దుర్గాకుమార్ (100 పరుగులు)

నాలుగు సెంచరీలు నమోదు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జోనల్ అండర్-23 మల్టీడేస్ క్రికెట్ పోటీల్లో బ్యాట్స్‌మన్ చెలరేగడంతో భారీ స్కోరు నమోదైంది. కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 379 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన నార్త్‌జోన్ జట్టు 135.1 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 639 పరుగుల భారీ స్కోరు నమోదు చేసి డిక్లేర్ చేసింది. జట్టులోని రవికిరణ్ 121 పరుగులు, జె. దుర్గాకుమార్ 100 పరుగులతో రాణించారు. సెంట్రల్‌జోన్ బౌలర్లు నవీన్ 4 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సెంట్రల్‌జోన్ జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 42 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 121 పరుగులు చేసింది. జట్టులోని దుర్గాబాలాజీ 48 పరుగులతో క్రీజులో ఉన్నాడు. నార్త్‌జోన్ బౌలర్ శ్రీకర్‌సాయిరెడ్డి 2, వాసు 2 వికెట్లు తీశారు. దీంతో రెండోరోజు ఆట ముగిసే సమయానికి నార్త్‌జోన్ జట్టు 518 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

కేఓఆర్‌ఎం మైదానంలో..

కేఓఆర్‌ఎం మైదానంలో నిర్వహిస్తున్న మరో మ్యాచ్‌లో 358 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన రెస్ట్ ఆఫ్ జోన్ జట్టు రెండోరోజు గురువారం మరో నాలుగు పరుగులు చేసి 362 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని మహేంద్రయాదవ్ 51 పరుగులు చేశాడు. సౌత్‌జోన్ బౌలర్లు సంతోష్‌కుమార్ 3, మల్లికార్జున 3, అఖిల్ 3 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన సౌత్‌జోన్ జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 84.1 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 323 పరుగులు చేసింది. జట్టులోని వై. తేజారెడ్డి 150 పరుగులు, ధరణికుమార్‌నాయుడు 102 పరుగులు చేశారు. రెస్ట్ ఆఫ్ జోన్ బౌలర్లు చెన్నారెడ్డి 2, ఆశిష్‌రెడ్డి 2 వికెట్లు తీశారు. దీంతో రెండోరోజు ఆట ముగిసింది.

అల్పపీడనంతో అప్రమత్తంగా ఉండాలి

జిల్లా పశువైద్యాధికారి శారదమ్మ

కడప అగ్రికల్చర్ : అల్పపీడనం కారణంగా జిల్లాలో శని, ఆది, సోమవారాల్లో భారీ వర్షసూచనకు అవకాశం ఉన్నందున జిల్లాలోని పాడిరైతులు, గొర్రెల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ శారదమ్మ తెలిపారు. ముఖ్యంగా గొర్రెపిల్లలు, లేగపిల్లలను చలికి గూడులోనే ఉంచాలని ఆరుబయట ఉంచకూడదని తెలిపారు. అలాగే గేదెలు, ఆవులు, ఎద్దులను ఆరుబయట, చెట్లకింద, సరిగా లేని షెడ్లలో ఉంచకూడదన్నారు. అవి వర్షం కారణంగా కూలడం వల్ల కూడా మరణాలు సంభవించే ప్రమాదం ఉంటుందన్నారు. జిల్లాలోని పశు వైద్యులు, పశు సహాయక సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ అత్యవసర వైద్య సదుపాయాలు అందించాలని ఆమె సూచించారు.